క్లుప్తంగా

ముగిసిన కనకదుర్గమ్మ ఉత్సవాలు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండలో నూతనంగా నిర్మించిన శ్రీ కనకదుర్గా అమ్మ వారి ఆలయ విగ్రహ యంత్ర శిఖర ప్రతిష్ఠ మహోత్సవాలు శుక్రవారంతో ముగియగా చివరిరోజున స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో నూతనంగా శ్రీకనకదుర్గ అమ్మ వారి విగ్రహ ఏర్పాటు, ఉత్సవాలు నిర్వహించడం సంతోషకరమన్నారు. వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి, సర్పంచ్ చల్లా ఉమాసుధీర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు,ఉత్సవ కమిటీ బాధ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు డెమోకే పరిమితం

దేవరుప్పుల: తెలంగాణ ప్రజల్ని పక్కదారి పట్టించి కుటుంబపాలన పటిష్టత కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు డెమోకు మాత్రమే పరిమితవుతున్నాయని గ్రామీణ పేదల సంఘం, యుసీసీఆర్ఐ(ఎంఎల్) జిల్లాల కార్యదర్శులు గోల గంగారావు, చిలువేరు ప్రతాప్ ఆరోపించారు. డబుల్‌బెడ్రూం, దళిత బంధు, ప్రభుత్వ ఇనాం భూములకు పట్టాల జారీ, పంచాయతీ జూనియర్ కార్యదర్శుల ఉద్యోగ క్రమబద్ధీకరణను సత్వరమే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

పరామర్శ

రఘునాథపల్లి: ఖిలాషాపూర్‌లో ఇటీవల మృతిచెందిన ఉపాధ్యాయుడు నక్క రాంచందర్ కుటుంబాన్ని శుక్రవారం మండల విద్యాశాఖాధికారి బానోత్ భగవాన్ ఉపాధ్యాయులతో కలిసి పరామర్శించారు. ఖిలాషాపూర్‌లో రాంచందర్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో ఎంతో నిబద్ధతతో పని చేసి హఠాన్మరణం పొందడం బాధాకరమన్నారు. ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శాగ కైలాసం, జిల్లా ప్రధాన కార్యదర్శి శాడ రమేష్, బానోతు రమేష్ పాల్గొన్నారు.

చెక్కు అందజేత

లింగాలఘణపురం: మండల కేంద్రానికి చెందిన రైతు దండు వెంకటేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, ఆ కుటుంబానికి విజయ డెయిరీ నుంచి అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం శుక్రవారం పాల కేంద్రం చైర్మన్ తిరుమలయ్య రూ.5వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా పాల కేంద్రం చైర్మన్ మాట్లాడుతూ పాడి రైతులకు ఎంతో ప్రోత్సాహం అందజేస్తున్న విజయ డెయిరీకి పాలు పోయాలని కోరారు. సూపర్‌వైజర్ వెంకట్‌రెడ్డి, కార్యదర్శి శ్రీశైలం, నరేశ్ పాల కేంద్రం డైరెక్టర్లు పాల్గొన్నారు.

సంతలో జీవాల క్రయవిక్రయాలు

బచ్చన్నపేట : మండల కేంద్రంలో ప్రతి ఆదివారం నిర్వహించే వారాంతపు సంతలో మేకలు, గొర్రెల క్రయవిక్రయాలు కూడా చేపట్టినట్లు సర్పంచ్ వడ్డెపల్లి మల్లారెడ్డి శుక్రవారం తెలిపారు. గతంలో జీవాలను క్రయవిక్రయాల కోసం నర్మెట, నవాబుపేట, హుస్నాబాద్ సంతలకు ప్రజలు వెళ్లేవారని తెలిపారు. వ్యయప్రయాసాలకోర్చి ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో గత వారం నుంచి జీవాల క్రయవిక్రయాలను స్థానికంగానే వారంతపు సంతలో చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

నేడు సర్వసభ్య సమావేశం

జఫర్‌గఢ్: నేడు(శనివారం) స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వివిధ శాఖల పనితీరుతో పాటు ప్రజా సమస్యలపై చర్చించేందుకు మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో పాటు వివిధ శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

రెయిలింగ్‌ను ఢీకొట్టిన ఇసుక లారీ

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఛాగల్లులో జాతీయ రహదారిపై రెయిలింగ్‌ను ఇసుక లారీని ఢీకొట్టిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు.. హనుమకొండ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఇసుకలారీ అదుపు తప్పి ఛాగల్లులో జాతీయ రహదారిపై రేయిలింగ్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రేయిలింగ్ ధ్వంసమైంది.

రెండు బైక్‌లు ఢీ..

జనగామ రూరల్: బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం పట్టణంలోని నెహ్రూపార్క్ వద్ద చోటు చేసుకుంది. వివరాలు..ఎర్రగొల్లపహాడ్‌కు చెందిన కొండ రాజు తన కూతురును జనగామ బస్టాండ్ నుంచి ఇంటికి తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో వడిచెర్లకు చెందిన ఎండీ.అహ్మద్ పాషా ద్విచక్ర వాహనంపై జనగామ నుంచి ఇంటికి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన బైకు ఢీకొట్టడంతో రాజుకు కాలు విరగగా ఇద్దరికి అయ్యాయి.

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవం


స్టేషన్‌ఘన్‌పూర్: పూజ చేస్తున్న ఎమ్మెల్యే రాజయ్య


దేవరుప్పుల: బొడ్రాయి పునఃప్రతిష్ఠాపనలో భక్తులు

రఘునాథపల్లి: మండల కేంద్రంలో శుక్రవారం దేవతా మూర్తుల విగ్రహాల ప్రతిష్ఠాపనను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. సర్పంచ్ పోకల శివకుమార్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన విజయదుర్గాదేవి, ఎల్లమ్మ, పోచమ్మ, ముత్యాలమ్మ, మైసమ్మ దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు చొల్లేటి వెంకటరమణశర్మ, సంతోష్‌శర్మ, పిండిపోలు శ్రీనివాస్, వెంకటసాయి ప్రసాద్‌శర్మ, అనంతసాగర్, విద్యాధరశర్మ, చంద్రశేఖరశర్మల వేద మంత్రోచ్చారణాలతో యంత్ర ప్రతిష్ఠ, దేవతాప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, కలాన్యాసం, దృష్టికుంభం, దిక్పాలక బలి, జయాధిహోమం, పూర్ణాహుతి, కలశోద్వాసనం, దేవతామార్జనం, మహదాశీర్వచనం, శాంతి కల్యాణం కమనీయంగా సాగింది. అనంతరం మహాన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ దేవతల ఉత్సవాల సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

ఎమ్మెల్యే రాజయ్య ప్రత్యేక పూజలు

గ్రామదేవతల విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని, ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు. జెడ్పీటీసీ బొల్లం అజయ్, మాజీ ఎంపీపీ కుమార్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ చీమలపాటి రవీందర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ముసిపట్ల విజయ్, మాజీ వైస్ చైర్మన్ నామాల బుచ్చయ్య, ఉప సర్పంచ్ యాద రాములు, నిర్వాహణ కమిటీ సభ్యులు రాఘవరెడ్డి, నాగేష్, వెంకటయ్య, శ్రీహరి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా దుర్గమాత ఉత్సవాలు ప్రారంభం

దేవరుప్పుల : మండల కేంద్రంలో బొడ్రాయి పునఃప్రతిష్ఠాపనతోపాటు దుర్గమాత ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం గ్రామ పంచాయతీ వద్ద వేదపండితులు ఉప్పల రమేష్ శర్మ, పెద్దాపురం వెంకటేశ్వర శర్మ, గంగుసత్యం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గమాత ఉత్సవాలు పురస్కరించుకొని బస్‌స్టేజి వద్ద దుర్గమాత, హనుమాన్ విగ్రహాలు పునఃప్రతి ష్ఠాపన, దేవరుప్పులలో శ్రీ కంఠమహేశ్వర విగ్రహం, పెద్దమ్మ తల్లి, మైసమ్మ తదితర గ్రామ దేవతల విగ్రహాల ప్రతిష్ఠాపన చేశారు. అనంతరం దేశగురువు దాసరి ధనుంజయ్‌రెడ్డి ఆధ్వర్యంలో బొడ్రాయికి బోనాల సమర్పణతో పొలిమేరహారం చేసి గావు పట్టి గ్రామ సుభిక్షం కోసం ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ ఈదునూరి రమాదేవి నరసింహారెడ్డి, ఎంపీటీసీ తోటకూరి రేణుక కిష్టయ్య, ఉప సర్పంచ్ తోటకూరి దశరథ, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు తీగల దయాకర్ గౌడ్, ఆయా సామాజికవర్గాల పెద్దలు పాల్గొన్నారు.

నిరుద్యోగులను దగా చేసిన సీఎం


స్టేషన్‌ఘన్‌పూర్: మాట్లాడుతున్న చేపూరి చిరంజీవి

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నిరుద్యోగులను దగా చేశారని, నిరుద్యోగ యువత జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ చేపూరి చిరంజీవి అన్నారు. డివిజన్ కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నిరుద్యోగులు, యువతకు చేసిన హామీలను విస్మరించారన్నారు. నిరుద్యోగ భృతి, ఇంటికో ఉద్యోగం తదితర హామీలను తుంగలో తొక్కారన్నారు. తెలంగాణలో నిరుద్యోగ డిక్లరేషన్ల కోసం ఈనెల 8న హైదరాబాద్ సరూర్‌నగర్‌లో నిర్వహించనున్న బహిరంగ సభకు కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకురాలు ప్రియాంకగాంధీ హాజరవుతున్నారని, నియోజకవర్గం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు. నాయకులు ఏలియా, వసంత్, బాలరాజు, నర్సయ్య, యాదగిరి, రాజు, ఈశ్వర్ పాల్గొన్నారు.

హన్మంతాపూర్‌లో పెద్దమ్మ పండుగ


పూజ చేస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి


దుర్గామాత ఉత్సవాల్లో ఎమ్మెల్యే

నర్మెట: మండలంలోని హన్మంతాపూర్‌లో పెద్దమ్మ పండుగ సందర్భంగా ముదిరాజ్‌లు శుక్రవారం పుట్టపెట్టె కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నియోజక వర్గ కోఆర్డినేటర్ గుజ్జ సంపత్ రెడ్డి, ఎంపీపీ తేజావత్ గోవర్ధన్, సర్పంచ్ పగడాల విజయ నర్సయ్య, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు చింతకింది సురేష్, ఇట్టబోయిన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమాతను దర్శించుకున్న ఎమ్మెల్యే

జనగామ రూరల్: మండలంలోని శామీర్‌పేటలో మూడు రోజులు గ్రామ దేవతల, దుర్గమాత ఉత్సవాలు అంగరంగవైభవంగా నిర్వహించారు. కాగా, శుక్రవారం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఎంపీపీ మేలక కళింగ రాజు, సర్పంచ్ స్వరూపతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను వినియోగించుకోవాలి


మస్టర్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సురేందర్‌నాయక్

కొడకండ్ల: గ్రామాల్లో నిర్వహిస్తున్న జాతీయ ఉపాధి హామీ పనులను కూలీలు వినియోగించుకోవాలని ఎంపీడీఓ సురేందర్‌నాయక్ కోరారు. శుక్రవారం నీలిబండతండాలో ఫార్మేషన్ రోడ్డు పనులను ఆయన తనిఖీ చేసి మస్టర్‌లను పరిశీలించి కూలీలకు అవగాహన కల్పించారు. ఏపీఓ కుమారస్వామి, సర్పంచ్ విమలతోపాటు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపిన కేసీఆర్



కొడకండ్ల: సుదీర్ఘ కాలం పాటు చాలీచాలని వేతనాలతో దుర్భర జీవితాలు గడుపుతున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించి జీవితాల్లో సీఎం కేసీఆర్ వెలుగు నింపాడని కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాలి అశోక్ అన్నారు. కాంట్రాక్ట్ లెక్చరర్స్‌ను క్రమబద్ధీకరిస్తూ ఉత్తర్వులు జారి చేయడం పట్ల శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. శ్రీనివాసరావు, రవికుమార్, జాంబ, సూర్యప్రకాష్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

కార్మికులకు వైద్యపరీక్షలు


కార్మికులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

రఘునాథపల్లి: మండలంలోని నిడిగొండలో ప్రభుత్వ కార్మిక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో లేబర్ కార్డు గల కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా లేబర్ అధికారి కుమారస్వామి మాట్లాడుతూ కార్మికుల ఆరోగ్య సంక్షేమం కోసం కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేస్తామన్నారు. భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొమ్ముగళ్ల కృష్ణ, గ్రామ అధ్యక్షుడు తిప్పారపు ప్రకాష్, జిల్లా కోఆర్డినేటర్ సుమన్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



రఘునాథపల్లి: సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ (సీఈఐఆర్)తో పోగొట్టుకున్న సెల్ ఫోన్‌ను రికవరీ చేసి బాధితుడికి అప్పగించిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలిలా.. మండలంలోని రామరాయనిబంగ్లా గ్రామానికి చెందిన తోట మహేష్ బంధువుల ఇంటికి వెళ్తుండగా సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. బాధితుడు సీఈఐఆర్‌లో ఫిర్యాదు చేశాడు. మొబైల్ దొరికిన వ్యక్తి మరో సిమ్ కార్డు వేయగా అలర్ట్ మెసేజ్ రావడంతో పోలీసులు వెంటనే టవర్ లొకేషన్ ఆదారంగా గుర్తించి రికవరీ చేశారు. కానిస్టేబుళ్లు వీరన్న, సారంగలు శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో బాధితుడికి సెల్‌ఫోన్ అందజేయగా వారికి కృతజ్ఞతలు తెలిపారు.

లేగదూడల పంపిణీ


లేగ దూడలను పంపిణీ చేస్తున్న అగర్వాల్

చిల్పూరు: ప్రస్తుత తరుణంలో పాడి పశువుల పెంపకం కుటుంబాలకు లాభదాయకమని తెలంగాణ గోశాల ఫెడరేషన్ గౌరవ అధ్యక్షుడు మహేష్‌అగర్వాల్ అన్నారు. మండలంలోని కొండాపూర్‌లో శుక్రవారం దళిత మహిళ గోరక్ష సమితి అధ్యక్షురాలు మోతె విజయ ఆధ్వర్యంలో లేగ దూడలను పంపిణీ చేశారు. సర్పంచ్ లొడెం రజిత, రవీందర్, దుర్గం రోజ, భాస్కర్, వెంకట్, మోతె నర్సయ్య, విజయరాణి, రవి, రమ, రాజేశ్వరి, సుమలత, సునీత, స్వర్ణలక్ష్మి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై స్పష్టత ఇవ్వాలి

లింగాలఘణపురం: ఈ నెల 7న తెలంగాణలో నిర్వహించే బహుజనుల భరోసా కార్యక్రమానికి విచ్చేస్తున్న బీఎస్‌పీ అధినేత మాయయాతి ఎస్సీ వర్గీకరణపై స్పష్టత ఇవ్వాలని ఎంఎస్‌పీ జిల్లా నాయకుడు సందెన రవీందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై అన్ని రాజకీయ పక్షాలు సానుకూలంగా ఉండగా బీఎస్‌పీ ఒక్కటి మౌనంగా ఉందని, వర్గీకరణకు అనుకూలమా..? వ్యతిరేకమో చెప్పాలన్నారు. ఎంఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఉపేందర్, మల్లేశం, మేడ శ్రీనివాసు, పవన్, కరుణాకర్, సుధాకర్, నర్సయ్య, అఖిల్ పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల ధర్నా


ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

జనగామ రూరల్: కర్నాటక కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో బజరంగ్‌దళ్‌ను నిషేధించాలని ప్రకటించడాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో జనగామ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉడుగుల రమేష్ మాట్లాడుతూ బజరంగ్‌దళ్‌ను నిషేధించాలనుకోవడం కాంగ్రెస్ అవివేకమని అన్నారు. హిందువుల మనోభావాలు కించపరిచే విధంగా ఉందని దీనికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి, సొడ రమేష్, శివరాజ్, బేజాడి బీరప్ప, రాజశేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమార్చనలు


కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

జనగామ రూరల్: వైశాఖ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో పవన్ శర్మ, ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అలాగే మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ హరిశ్చంద్ర గుప్త, నర్సింహరావు, సేవా సమితి సభ్యులతోపాటు తదితరులు పాల్గొన్నారు.

జేపీఎస్‌ల సమస్యలు పరిష్కరించాలి


బచ్చన్నపేట: సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న సర్పంచ్ వెంకట్‌గౌడ్


జనగామ రూరల్: నిరసన తెలుపుతున్న జేపీఎస్‌లు

బచ్చన్నపేట: సమస్యలు పరిష్కరించాలని మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. శుక్రవారం సమ్మె 8వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు ప్రశాంత్ ఆచార్య మాట్లాడుతూ కార్యదర్శుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. అప్పటి వరకు సమ్మెను విరమించబోమని హెచ్చరించారు. కార్యదర్శుల సమ్మెకు కొన్నె గ్రామ సర్పంచ్ వేముల వెంకట్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వంచ వెంకట్‌రెడ్డి, పలువురు నాయకులు సంఘీభావం తెలిపారు. ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్, కోశాధికారి సతీష్‌రెడ్డి, కార్యదర్శులు కర్ణాకర్, రాజశేఖర్, రేవతి. కవిత, రుబీనా, నరేష్, మధు, రమేష్, ఉపేందర్, వెంకటేష్, శ్రీనివాస్‌చారి, భరత్, భాను పాల్గొన్నారు.

జనగామ రూరల్:జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు ఎం రాజు డిమాండ్ చేశారు. కార్యదర్శులు చేపడుతున్న దీక్షలు శుక్రవారం 8వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ప్లకార్డులతో నిరసన తెలిపారు. రాజు, మధు , రేణుక, పాల్గొన్నారు.

జీపీ కార్యాలయానికి తాళం

తమ సర్వీసును క్రమబద్ధీకరించాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు మండలంలోని పెద్ద తండా (ఎం)లో సర్పంచ్ లచ్చిరాం నాయక్ జీపీ కార్యాలయానికి తాళం వెసి వారికి మద్దతు పలికారు. జేపీఎస్‌ల న్యాయమైన డిమాండ్లను తక్షణం పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

చిల్పూరులో..

చిల్పూరు: మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శుల సమ్మె కొనసాగుతోంది. శుక్రవారం రాజవరం గ్రామస్తులు వారికి సంఘీభావం తెలిపారు.

వంటావార్పుతో జీపీ కార్యదర్శుల నిరసన

దేవరుప్పుల: మండల పరిషత్ కార్యాలయం వద్ద గ్రామ పంచాయతీ జూనియర్ కార్యదర్శుల ఉద్యోగ క్రమబద్ధీకరణ చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం వంట వార్పు–సహపంక్తి భోజనం చేసి నిరసన తెలిపారు. వీరి ఆందోళనకు ఎంపీఓ టి సురేష్‌కుమార్, రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరన్న సంఘీభావం తెలిపారు. శ్రీకాంత్, అమరేందర్, వాణిశ్రీ, అశ్విణి, సంధ్యరాణి, ఫర్జానా, అనిల్, నాగరాణి పాల్గొన్నారు.

వినూత్న నిరసన

రఘునాథపల్లి: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని మండల కేంద్రంలో చేపట్టిన సమ్మె శుక్రవారం నాటికి ఎనిమిదవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శులు కళ్లకు గంతలు, ప్లకార్డులు చేతబట్టుకొని మోకాళ్లపై నిల్చొని వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. సంఘం మండల అధ్యక్షుడు మహేష్, పంచాయతీ కార్యదర్శులు రాధిక, మౌనిక, బానుప్రియ, శ్రీలత పాల్గొన్నారు.

సంఘీభావం...

తరిగొప్పుల: తమ ఉద్యోగాన్ని క్రమబద్ధీకరించాలని కోరుతూ జేపీఎస్, ఓపీఎస్‌లు చేపట్టిన శాంతియుత నిరవధిక సమ్మె శుక్రవారం 8వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు గద్దల కిషోర్ సమ్మెలో పాల్గొని సంఘీభావం తెలిపారు. భూక్య రాజేందర్, హరిత, మమత, మాధవి, నవనీత, కుమార్, కృష్ణ పాల్గొన్నారు.

పాలకుర్తిలో..

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలో 8వ రోజుకు చేరిన జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మెలో వినూత్నంగా వంట వార్పుతో నిరసన తెలిపారు. సమ్మెకు రాష్ట్ర పట్టభద్రుల పంచాయతీ కార్యదర్శుల వ్యవస్థాపక అధ్యక్షుడు జిలుకర వెంకన్న సంఘీభావం తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఇప్పగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1985–86 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పాఠశాల ఆవరణలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బాల్య స్నేహితులు ఒకే చోట కలిసి ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు. తమ బాల్య స్మృతులను నెమరువేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. ఉపాధ్యాయులు మంగు జీవన్, వెంకటస్వామి, రఘుజీ, ప్రమోద్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు నిమ్మ భగవాన్‌రెడ్డి, రాంబాబు, ఆదిరెడ్డి, రవి, పార్వతి, శైలజ, జైహింద్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్థికసాయం

జనగామ రూరల్: నర్మెట మండలంలోని వెల్దెండకు చెందిన మార్క బాలరాజు ఇటీవల తాటి చెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు కిందపడి గాయాలయ్యాయి. కాగా, శుక్రవారం టాడా కార్పొరేషన్ నుంచి వైద్య ఖర్చు కోసం రూ.15 వేల చెక్కును జిల్లా బీసీ సంక్షేమ కార్యాలయంలో అధికారి బి.రవీందర్, జూనియర్ అసిస్టెంట్ కిరణ్ బాధితుడికి అందజేశారు. వెంకట మల్లయ్య, రామూర్తి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పల్లెల్లో ‘స్పీక్ ఏ బుక్’ పోటీలు నిర్వహించండి

రఘునాథపల్లి: వేసవి సెలవుల వేళ విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించేలా గ్రామాల్లో స్పీక్ ఏ బుక్ పోటీలు నిర్వహించాలని మండలంలోని ఖిలాషాపూర్ గ్రామానికి చెందిన 5ఈ వ్యవస్థాపకులు, సామాజిక వేత్త కేశిపెద్ది నర్సింహరాజు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన పలువురు సర్పంచ్‌లకు ఆయన లేఖ రాశారు. గ్రామంలోని విద్యార్థులకు ఎడ్యుకేషన్ అండ్ ఎంప్లాయిబులిటీ స్కిల్స్‌లో పెంపొందించేందుకు పుస్తక పఠనంపై ఆసక్తి కల్పించే కార్యక్రమాలకు ప్రోత్సహించాలన్నారు. 5ఈ (ఎడ్యుకేషన్ ఎంప్లాయిబులిటీ, ఎఫిషియెన్సీ, ఎంపతి, ఎథిక్స్) ఆధ్వర్యంలో 18 అంశాలతో ఛాంపియన్ ప్రొఫైల్ రూపొందించినట్టు పేర్కొన్నారు. ఇందులో పుస్తక పఠనం ఒక అంశమని, విద్యార్థులు ఏదైనా పుస్తకం చదివి.. అందులో విషయాలపై మాట్లాడాల్సి ఉంటుందన్నారు. వేసవిలో లభించే సమయాన్ని విద్యార్థులు పుస్తక పఠనం కోసం వెచ్చించేలా స్పీక్ ఏ బుక్ పోటీలు నిర్వహించాలని కోరారు. పోటీకి సంబంధించిన మరిన్ని వివరాలను వాట్సాప్ నంబర్ 8790367467ను సంప్రదించాలని ఆయన సూచించారు.

కవి సోమన్నకు సన్మానం



దేవరుప్పుల : శ్రీశ్రీశ్రీ కళావేదిక జనగామ ఆధ్వర్యంలో మండల కేంద్రానికి చెందిన ఎస్‌వీ ఒకేషనల్ జూనియర్ కళాశాల తెలుగు అధ్యాపకుడు, సామాజిక కవి, రచయిత అంకాల సోమన్నను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వేదిక జరసం, కవులు, కళాకారుల ఐక్యవేదిక అధ్యక్షుడు జి.కృష్ణ, కవి అయిలా సోమనర్సింహాచారి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత జీవన శైలిని తెలిపేలా అనేక రచనలు చేసిన సోమన్న భావితరానికి ఆదర్శంగా నిలుస్తారన్నారు.